అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని దండిసురవారం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పడిబత్తిన గంగరాజు కుటుంబానికి స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు పెంకి శివ, గోపి, వీర్రాజు, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్, తలుపులయ్య తదితరులు పాల్గొన్నారు.

అరట్లకోటలో లేఅవుట్‌పై సర్వత్రా చర్చ...

- కొత్త లేఅవుట్‌కు గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి సంతకం
- 3ఎకరాల లేఅవుట్‌కు రూ.10లక్షలు చేతులు మారిన వైనం
- లేఅవుట్ రెన్యువల్‌కు సంతకాలు చేయని ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలో 3 ఎకరాల్లో వేస్తున్న కొత్త లేఅవుట్‌పై సర్వత్రా చర్చ జరుగుతుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన లేఅవుట్‌కు సంబంధించి ఇప్పటికే రూ.10 లక్షలు చేతులు మారినట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. అరట్లకోట గ్రామ పరిధిలో 3ఎకరాల్లో లేఅవుట్ వేసేందుకు యజమాని అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికి సంబంధించి ఉడా అనుమతులకు వెళితే నిబంధనల పేరుతో తడిసి మోపెడవుతుందని భావించారు. దీంతో ఉడా పరిధిలోకి రాని సమయంలో ఉన్న పంచాయతీ కార్యదర్శితో సంతకాలు చేయించేందుకు నిర్ణయించారు. దీని కోసం గత ఏడాది ఫిబ్రవరి నెలలో ల్యాండ్ కన్వర్షన్‌కు ధరఖాస్తు చేశారు. అయితే 3ఎకరాల్లో లేవుట్‌కు పంచాయతీ నుండి అప్రూవల్ పొందినట్లుగా 2011లో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శితో సంతకం తీసుకున్నారు. ఉడా పరిధిలోకి రాకుండా ఉండేందుకు గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శితో సంతకం చేయించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి గాను సంతకం పెట్టిన పంచాయతీ కార్యదర్శితోపాటు పలువురికి రూ.10లక్షలు మేర పంపకాలు చేసినట్లు సమాచారం. ఒక వేళ 2011లోనే లేఅవుట్ పంచాయతీ ఆమోదం పొంది ఉన్నట్లయితే పంచాయతీ రికార్డుల్లో నమోదు అయి ఉండాలి. పంచాయతీకి ఫీజు చెల్లించి ఉండాలి. పంచాయతీకి ఎకరాలకు 5సెంట్లు స్థలం కేటాయించి ఉండాలి. ల్యాండ్ కన్వర్షన్ కోసం రెవెన్యూ నుండి అనుమతులు పొంది ఉండాలి. ఇవేమి పంచాయతీలో రికార్డుల్లో నమోదు కాలేదు. అంతేగాక గతంలో లేఅవుట్ వేసినట్లు చూపడంతో లేవుట్‌ను రెన్యువల్ చేసేందుకు ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శిపై వత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీనికి పంచాయతీ కార్యదర్శి ఒప్పుకోలేదని తెలిసింది. దీనిపై జిల్లా అధికారులు స్పందించి, కొత్తగా వేస్తున్న లేఅవుట్‌కు పాత పంచాయతీ కార్యదర్శి చేసిన సంతకంపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరవాడలో వైసీపీకి భారీ షాక్
పంచకర్ల సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ సర్పంచ్

విశాలాంధ్ర - పరవాడ: మేజర్ పంచాయతీ పరవాడలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ నుంచి ముఖ్య నేతలు జనసేనలో చేరారు. సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పెద్దచెరువు ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావుకు గురువారం పెందుర్తి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. వారితో పాటు వార్డు మెంబర్లు సిరిపురపు రాజేష్, గెద్దం లక్ష్మిరామారావు, పాలసొసైటీ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు, వాసవి క్లబ్ మెంబర్స్, మాజీ వార్డు మెంబర్లు, మరో కొన్ని కుటుంబాలు జనసేనలో చేరాయి. వైసీపీ పాలనలో ఎక్కడా అభివృద్ధి లేదన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచులను సైతం ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పైల రాచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జనాధరణ పొందుతున్న జనసేన

విశాలాంధ్ర - మునగపాక: మునగపాక మండలం నారాయుడుపాలెం గ్రామంలో వైసీపీకి చెందిన కీలక నాయకులు జనసేనలో చేరారు. చందనాటి పరదేశి నాయుడు వారితోపాటు సుమారు 100 మంది మహిళలు, 50 మంది పురుషులు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీ కండువాలు కప్పుకున్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని పాయకరావుపేట, కొర్లయ్యపేట గ్రామాలలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నిఖిల్, బొంది కాశీ విశ్వనాథ్, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, చింతకాయల రాంబాబు, మల్లపురెడ్డి రామకుమారి, విలియం కేరి, సుబ్రహ్మణ్యం, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, లెక్కల గోవిందు, చిరుకూరి పేర్రాజు, గుల్ల నాగరాజు, వేములపూడి అప్పారావు, రాజాన ఆది, ఆచంట దొర, బి ఎస్ నారాయణ, శివలంక నాగమల్లి, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారుమాంబ పండగ

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండలం గొర్లివానిపాలెంలో శ్రీ బంగారు మాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభ మయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సర్పంచ్ గొర్లి గోవి అమ్ములు, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు గొర్లి గోపి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఉచిత ప్రసాదం పంపిణీ చేసింది. ఎంపీటీసీ గొర్లి ఎరుకు నాయుడు వరలక్ష్మి, ఉప సర్పంచ్ గొర్లి రామారావు, స్థానిక నాయకులు గొర్లి శ్రీనివాస్, గొర్లి గిరిబాబు, కె.వి.ప్రసాద్, చిప్పాడ రామారావు, పైల అప్పారావు, పోలిరెడ్డి అప్పారావు, పైల రాధాకృష్ణ, గొర్లి లోకేష్ ,గొర్లి శివాజీ కుమార్, యాసవరపు బుజ్జి అనకాపల్లి మోహన్ , అనకాపల్లి శివ చూచుకొండ శ్రీను తదితరులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

సుందరపు నామినేషన్‌కు జనం జేజేలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: జనసేన, టిడిపి, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ నామినేషన్‌కు గురువారం మండలంలోని గ్రామ గ్రామాల నుండి జనసైనికులు, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి సుందరపు విజయకుమార్, అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, ఎలమంచిలి టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావులతో వెళ్లి నామినేషన్ వేశారు.

మోసకారి జగన్‌ని నమ్మకండి: అనిత

విశాలాంధ్ర- కోటవురట్ల: గత ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మాయమాటలకు లోబడి మోసపోయామని ఈసారి మోసకారి జగన్మోహన్ రెడ్డి జిమ్మిక్కులకు మోసపోవద్దని పాయకరావుపేట కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. గురువారం మండలంలో టి.జగ్గంపేట గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పారుపల్లి కొండబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ఆమెకు హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. టి.జగ్గంపేట గ్రామ అభివృద్ధి ప్రదాత అనిత అమ్మకు గ్రామస్తులంతా ఏకమై అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని వ హామీ ఇచ్చారు. అనిత ఎమ్మెల్యే హయంలో టీ జంగంపేట గ్రామానికి సుమారు నాలుగున్నర కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం చేసి వారి రవాణా కష్టాలు తీర్చినందున ఆమెకు గ్రామస్తులంతా సంపూర్ణ మద్దతు తెలిపారు. మళ్లీ అనితను ఎమ్మెల్యేగా గెలిపించుకొని టీ జగ్గంపేట అభివృద్ధికి అధిక నిధులు తెచ్చుకొని గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని ముక్తకంఠంతో నినాదించారు ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామానికి అధిక నిధులు కేటాయించి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అనిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి లాలం కాశి నాయుడు, మండల తెదేపా అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జనార్ధన్, మండల తెదేపా ప్రధాన కార్యదర్శి లింగం నాయుడు, భాస్కరరావు, సుంకర బాబ్జి, తిరుమలరావు, బోడపాలెం సత్యనారాయణ, నాని బాబు, మేకల గోవిందు, నంబరు రాంబాబు, స్థానిక తెదేపా నాయకులు మహిళలు పాల్గొన్నారు.

తొలిరోజు నామినేషన్లు నిల్: ఆర్‌వో కె.గీతాంజలి

విశాలాంధ్ర - నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికలకు శనివారం నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ కె.గీతాంజలి తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సెలవు రోజు మినహా 25వ తేది వరకు నక్కపల్లి ఆర్వో కార్యాలయం వద్ద నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన సామాగ్రిని సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యాలయం వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తున్నామని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిబంధనల మేరకు మాత్రమే అభ్యర్థులతో పాటు అనుమతిచ్చిన వారిని కార్యాలయం పరిధిలోనికి రానివ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తియ్యేటట్లు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నామినేషన్ పత్రాలతో పాటు అభ్యర్థికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తదితర వివరాలను అందజేయాలన్నారు. ఈ మేరకు నామినేషన్ తొలిరోజు కావడంతో పోటీ చేసే అభ్యర్థులను ఎటువంటి నామినేషన్లు దాఖలు చేయలేదని ఆర్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి సుందరపు నామినేషన్

విశాలాంధ్ర - ఎలమంచిలి: జనసేన, టిడిపి, బిజెపి కూటమి బలపరిచిన ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మూడు పార్టీల కార్యకర్తలతో ముందుగా విజయ్ కుమార్ సొంత గ్రామం కొత్తూరు నుంచి బయలుదేరి ర్యాలీగా ఎలమంచిలి చేరుకున్నారు. భారీ జన సందోహం ఎలమంచిలి రావడంతో పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ముందుగానే ఈ పరిస్థితిని ఊహించిన పోలీసులు ఆర్టీసీ బస్సుల రాకపోకలను మళ్ళించారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎలమంచిలి సీఐ గపూర్, పట్టణ ఎస్సై, నాలుగు మండలాల పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసి కార్యకర్తలను అదుపు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు మధ్య ఉన్న రోడ్డును బ్లాక్ చేశారు. నామినేషన్ సమయంలో తహశీల్దార్ కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు కొందర్ని మాత్రమే అనుమతించారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, తెలుగుదేశం మాజీ ఎంపీ పప్పల చలపతిరావు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావుతో కలిసి సుందరపు విజయ్ కుమార్ అభ్యర్థిత్వాన్ని ఎన్నికల అధికారికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చైర్మన్ లాలం భవాని, రాజన్న రమేష్, గొర్ల నానాజీ కొటారు సాంబ, కొటారు నరేష్, అన్నం వెంకటరావు, బిజెపి నాయకులు రాజాన సన్యాసినాయుడు, సత్యనారాయణ, పప్పు ఈశ్వరరావు, నక్క శివశంకర్, ఉత్తరాంధ్ర జనసేన పార్టీ సమన్వయ ప్రతినిధి సుందరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మోడీజీ 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ....?
కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గంగాధర్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ మోడీజీ అని అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐ.ఆర్.గంగాధర్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దళిత బహుజన కాలనీలో పర్యటించారు. పది సంవత్సరాల క్రితం బీజేపీ తన మేనిఫెస్టోలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిందని అన్నారు. నేటికి 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయని గంగాధర్ ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో ఉందని, కాని వాటి గురించి మాట్లాడకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, విభజన హామీ చట్టాల అమలు వంటి హామీలు తిరుపతి వెంకన్న సాక్షిగా చెప్పారని అన్నారు. కాని ఏ ఒక్క హామీని బీజేపీ అమలు చేయ లేదని గంగాధర్ అన్నారు. దేశ రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాలు బిజెపి తీవ్రస్థాయిలో చేస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని గంగాధర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విలువనిచ్చేది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని గంగాధర్ ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని గంగాధర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో అనకాపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కట్టుమూరి నూక అప్పారావు, అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్, కశింకోట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సనేడ గజ్జాలు, డీసీసీ కార్యదర్శి ఎగ్గాడ భాస్కర్‌రావు, దళిత నాయకులు పి.నర్సయ్య, భూపతి కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకుడు కొల్లి సత్యారావు, నందికి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రం సుభిక్షం
- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల

విశాలాంధ్ర - పరవాడ: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైసీపీని సాగనంపాలని పెందుర్తి నియోజకవర్గం ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఆయన ఇ.మర్రిపాలెం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాష్ట్రం బాగుండాలంటే ఎన్డీఏ (టిడిపి, జనసేన, బిజెపి) ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. గాజు గ్లాసుకి ఓట్లేసి తనను, కమలం గుర్తుకు ఓట్లేసి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. అంతకు ముందు రమేష్ బాబును మహిళలు ఆప్యాయంగా పలకరిస్తూ తిలకం దిద్ది హారతులతో ఘన స్వాగతం పలికారు.

అడుగడుగునా జనసైని కులు, మహిళలు, టిడిపి, బిజెపి శ్రేణులు స్వాగతం పలికారు.ఈ ప్రచారంలో భాగంగా పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. 85 వార్డు మంత్రిపాలెం నుంచి వైసీపీకి చెందిన పచ్చిగోరు వెంకటలక్ష్మి 50 మంది మహిళలతో జనసేన పార్టీలో చేరారు. గొర్లివానిపాలెం నుంచి వైసీపీ నాయకుడు పైలా దినేష్ 100 మందితో జనసేనలో చేరారు. వీరందరికీ పంచకర్ల జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సర్పంచులు మోటూరు సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాస్ కాసులు, జిల్లా పార్టీ కార్యదర్శి బుగుడి రామ గోవిందరావు, నాయకులు దుల్ల రామ నాయుడు, పంచకర్ల ప్రసాద్, బలిరెడ్డి అప్పారావు, కరణం నర్సింగరావు, కూండ్రపు మధు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశాల మేరకే మాడుగుల నుంచి పోటీ

విశాలాంధ్ర - వి.మాడుగుల: తెలుగుదేశం పార్టీ ఆదేశాలనుసారం మాడుగుల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి వెల్లడించారు. గురువారం ఆయన మాడుగులలో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ పివిజి.కుమార్‌లు ఘన స్వాగతం పలికారు. ముకుందపురం పెట్రోల్ బంక్ ప్రాంతం నుంచి వేలాది కార్యకర్తలతో బైక్ ర్యాలీగా శ్రీమోదకొండమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని మోదకొండమ్మను సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బండారు సత్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపుమేరకే మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో చేయడం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ ఇన్ చార్జ్ పివిజి.కుమార్ ఆధ్వర్యంలో మాడుగుల ఎమ్మెల్యేగా ఘన విజయం సాధిస్తానని చెప్పారు. ఈ ప్రాంత అల్లుడిగా, మనవడిగా మాడుగులతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మాడుగులను చంద్రబాబుకి కానుకగా ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపి సీఎం రమేష్ సోదరుడు సురేష్‌తో పాటు పార్టీ నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయండి
ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రానున్న లోకసభ, శాసనసభ ఎన్నికలలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని అనకాపల్లి పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి సిఎం రమేష్ కోరారు. గురువారం పలువురు ప్రముఖులతో ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోందని అన్నారు. తనను, ఆయా నియోజకవర్గ శాసనసభ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవడంలో మేధావులు, ప్రముఖుల పాత్ర ఎంతో వుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో విజయాన్ని అందివ్వడం ద్వారా కేంద్ర పెద్దలతో తనకున్న పరిచయాలతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపించే అవకాశం కల్పించాలని, ఆ విధంగా ప్రజల ఋణం తీర్చుకుంటానని సిఎం రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారంపూడి పరమేశ్వరావు, పరుచూరి భాస్కరరావు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

మిరాకిల్ సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగాలకు ఎంపికైన శ్రీ ప్రకాష్ డిగ్రీ విద్యార్థులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల నందు తృతీయ సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికలో మిరాకిల్ సాఫ్ట్ వేర్ కంపెనీకి ఎంపికయినట్లు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. కళాశాలలో రెగ్యులర్ క్లాసులతోపాటు విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాములు, ఇంటర్వ్యూలకు తగినటువంటి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు అభినందించారు.

వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ వేసవి జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి తెలిపారు. ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచామన్నారు. చిన్న పిల్లలు బయట తిరగకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్ని రకాల సర్జరీలు చేస్తున్నామన్నారు. జనరల్ ఫిజీషియన్ చిన్న పిల్లల వైద్యులు తప్ప పూర్తిస్థాయిలో డాక్టర్లు అందుబాటులో ఉన్నారని అన్నారు. ప్రతి బుధవారం గర్భిణీకి ప్రత్యేకంగా తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండటంతో దేవరపల్లి, వేపాడ, చీడికాడ తదితర దూర ప్రాంతాల నుండి రోగులు వస్తున్నారని అన్నారు. ప్రతి కాన్పుకు ఆరోగ్యశ్రీ ద్వారా 4000 రూపా యలు తల్లికి అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రోజురోజుకు ఓపి పెరుగుతున్నందున ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నట్లు ఆమె తెలిపారు.

కూటమి అభ్యర్థులు
కొణతాల, రమేష్‌లను గెలిపించండి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి అభ్యర్థులు గెలవాలని, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, బీజేపీ ఎంపీ అభ్యర్థి ప్రస్తుత రాజ్యసభ సభ్యులు సి.ఎమ్.రమేష్‌లను ప్రజలు గెలిపించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ప్రజలను కోరారు. గురువారం అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని బిఆర్టీ కాలని, తుమ్మపాల గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన ఓటు హక్కును మంచి అభ్యర్థులకి వేసి విజయం చేకూర్చాలని, ఒక్క ఛాన్స్ అని అడిగిన వారికి మరో ఛాన్స్ ఇచ్చి మోసపోవద్దని కోరారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, గంజాయి అమ్మకాలు చేసి ప్రజలను ముఖ్యంగా యువతను బానిసలుగా మార్చేసారని, ఎన్నికలు అంటే బంధుత్వాలు, మందుత్వాలు కాదని, కొణతాల రామకృష్ణ లాంటి మంచి నాయకుడు రాష్ట్ర శాసనసభలో ఉంటే ప్రజా సమస్యలపై స్పందిస్తారని సాగు త్రాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న ఒకే ఒక్క నాయకుడు కొణతాల అని భీశెట్టి అన్నారు. ప్రజలు వైఎస్ఆర్ పార్టీకి అధికారం ఇచ్చిన తరువాత ఉత్తరాంధ్రలో ఒక్క కొత్త పరిశ్రమ రాకపోగా

ఉన్న పరిశ్రమలు మూత పడిపోయి యువతకు ఉపాధి లేని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కనుబుద్ది నరసింగరావు, కొలసాని రమణ, పిల్లా హరి శ్రీనివాసరావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, సుపరి పాలన చూసి రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓట్లు వేసి గెలిపించాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు కోరారు. మండలంలోని పాల్తేరు, సత్యవరం గ్రామాల్లో వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కంబాల జోగులు మాట్లాడుతూ కుల, మత , పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పథకాల రూపంలో లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ధనిశెట్టి బాబురావు, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి, ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ, దేవవరపు వెంకటేశ్వరరావు, కోడా కోటేశ్వరరావు, సఖిలేటి రాము, మేడిశెట్టి రామ గోవిందు, తమర్సి గంగారావు, ఎజ్జల సత్యనారాయణ, గోసల రమణ, నీలాపు చిరంజీవి రెడ్డి, గోనెల సత్తిబాబు, గుజ్జు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ స్థానానికి
స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సఫీ ఉల్లా నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి పార్లమెంటు స్థానానికి గురువారం ఒక నామినేషన్ దాఖలయింది. 15 ని. లలో సమయం ముగుస్తుందనగా పెందుర్తి చాకలి వీధికి చెందిన షేక్ సఫీ ఉల్లా అనే అభ్యర్థి పార్లమెంటు స్థానానికి నామినేషన్ దాఖలు చేయడానికి రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి వద్దకు వచ్చారు. సమయం ఉన్నందున రిటర్నింగ్ అధికారి నామినేషన్ ను స్వీకరించారు. ఆయన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేస్తున్నట్లు చెప్పినప్పటికీ బీఫారం లేనందున సదరు నామినేషన్ను స్వతంత్ర అభ్యర్థిగా పరిగణించారు.

గడప గడపకు బెహర

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు 92వ వార్డు అజంత పార్కు కాలనీ, ట్రైలర్స్ కాలనీ, పద్మనాభ నగర్‌లలో బెహరా భాస్కర రావు గడపగడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం సాగిస్తూ ప్రతి ఇంటిని సందర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు 100 శాతం అమలు చేసిన నాయకుడు ఉన్నాడంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను
సందర్శించిన ఎన్నికల పరిశీలకులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు ఎన్.సంజయ్ గాంధీ, ఆశిష్ కుమార్ పాండే గురువారం కలెక్టరు కార్యాలయాన్ని సందర్శించారు. మొదట జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టిని కలసి తరువాత కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. ఉదయం 10 గం.లకు వ్యయ పరిశీలకులు సంజయ్ గాంధీ తరువాత 11 గం.లకు అనకాపల్లి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఆశిష్ కుమార్ పాండ్య కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఇన్ఛార్జి, మత్స్యశాఖ ఎ.డి. పి.ప్రసాద్, వారికి వివరిస్తూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయడం, ఎన్నికలలో నిబంధనలను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం కొరకు ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేస్తుందని దీనిలో కాల్ సెంటర్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, ఎక్స్ పెన్డీచర్ మొనటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వాహనాల పర్యవేక్షణ (జిపియస్ ట్రాకింగ్), వెబ్ క్యాస్టింగ్ మీడియా మోనటరింగ్, సోషల్ మీడియా మోనటరింగ్, కంప్లైంట్స్ మోనటిరింగ్, విభాగాలుంటాయని చెప్పారు. జిల్లాలో జరిగే ఎన్నికల ప్రక్రియ మొత్తం ఇక్కడి నుండే గమనించవచ్చున్నారు. ఈ విభాగాలన్నింటికీ జిల్లా అధికారులు నేతృత్వం వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ శాఖలలో వున్న నిపుణులైన సిబ్బందిని ఎంపికచేసి నియమించడం జరిగిందన్నారు. కమాండ్ కంట్రోల్ కేంద్రం ఇన్ ఛార్జి పి.ప్రసాద్ కంట్రోల్ సెంటర్ గూర్చి వివరిస్తూ గ్రీవెన్స్ కాల్ సెంటర్ లో టోల్ ఫ్రీ నం . 1950, ల్యాండ్ లైన్ నం.08924 226599 నంబరుకు వచ్చిన ఫిర్యాదులను జరుగుతుందన్నారు. కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, మోడల్ కోడ్ ఆఫ్

కాండక్ట్ విభాగం వీడియో వీవింగ్ టీమ్ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కోడ్ ను గమనించి చర్యలకు సిఫార్సుచేస్తారని వివరించారు. జి.పి.ఎస్. ట్రేసింగ్ ద్వారా వాహనాల గమనాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎంసిసి నోడల్ అధికారి జి.వి.లక్ష్మి మీడియా మోనటరింగ్ సింటర్ లో పత్రికలు, టీవీ ఛానళ్లలో వచ్చే వార్తలు, ట్రోలింగులు, ఇతర సమాచారం ఈవిభాగంలో రికార్డు చేయడం జరుగుతుందన్నారు. కోఆపరేటివ్ ఆడిట్ అధికారి సుబ్రమణ్యం పార్టీలు, అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించే విధానాన్ని తెలిపారు. పరిశీలకులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలివ్వగా పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

బొజ్జన్న కొండ అభివృద్ధి పనులను
త్వరగా పూర్తి చేయాలి
సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భముగ ప్రపంచ వారసత్వ సంపద ప్రాచీన కాలం నాటి కట్టడం అనకాపల్లి మణిహారం ప్రముఖ బౌద్ధ క్షేత్రం " బొజ్జన్న కొండ " అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్,రి.వ్యవస్థాపక అధ్యక్షులు, ఉభయ జిల్లాల బౌద్ధ సంఘాల సమాఖ్య ఆర్గనైజింగ్ ప్రచార ఉద్యమ కర్త " బల్లా నాగభూష ణము డిమాండ్ చేశారు. అనకాపల్లి మణిహారం ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన అతి ప్రాచీన కాలం నాటి ప్రపంచ వారసత్వ సంపద బౌద్ధ పర్యాటక కట్టడం "శంకరం నందు గల" బొజ్జన్న కొండ " అని అటువంటి 2 వేల 350 స..ము..ల నాటి బౌద్ధ క్షేత్రం పట్టించు కొనే నాధుడు కరవై అత్యంత దీనావస్థకు చేరి శిధిలా వస్థలో నున్న ఈ బొజ్జన్న కొండ ను అభివృద్ధి చేసి పర్యాటక సందర్శకులకు కావలిసిన అన్ని మౌళిక వసతి సౌకర్యాలు కల్పించా లని మా సిద్దార్థ సోషల్ సర్వీస్ కల్చ రల్ అసోసియేషన్‌ను స్థాపించిన 2004 స..ము నుండి కూడా మా సంస్థ ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాలకు, అధికారులకు, రాజకీయ ప్రతినిధులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు, విన్న వించటమే గాక, ఎన్నో నిరశన ప్రదర్శనలు, సోషల్ మీడియా వంటి ఎన్నో విధాలుగా పోరాటాలు చేయటం

అలాగే ఇతర బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు దేశ విదేశీ ప్రముఖ బౌద్ధ భిక్షువుల తో కలసి కూడా ఎన్నో కార్యక్రమాల చేసిన పిమ్మట ఈ మధ్యకాలములో ఇరు ప్రభుత్వాలు స్పందించి ఈ బొజ్జన్న కొండ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.అయితే ఈ బొజ్జన్న కొండ అభివృద్ధి పనులను శీఘ్ర గతిన పూర్తి స్థాయి లో చేసి అన్ని రకాల మౌళిక వసతులతో అతి త్వరలో పూర్తి చేసి అందుబాటు లోనికి తీసుకు వచ్చి ఎన్నాళ్ళు గానో సందర్శకుల, పర్యాటకుల, బౌద్ధ అభిమాన సంఘాల, బౌద్ధ భిక్షువుల, మరీ ముఖ్యముగా స్థానిక ప్రజల ఆకాంక్షలను,కన్న కలలను నిజం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి అధికారులకు,జిల్లా కలెక్టరు కి, సంబంధిత పురాతత్వ పరిశోధనల శాఖవారికి ఈ ప్రపంచ వారసత్వ సంపద దినోత్సవం సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నామని బల్లా నాగభూషణము తెలిపారు.

యువకుడిని కాపాడిన జివిఎంసి లైఫ్ గార్డులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో ఆర్కే బీచ్ ప్రాంతంలో అలల తాకిడికి మునిగిపోతున్న యువకుడను గమనించిన జీవీఎంసీ లైఫ్ గార్డులు రక్షించి ప్రాణాలు కాపాడరని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ గురువారం తెలిపారు. జోన్-3 పరిధిలో గల ఆర్కే బీచ్ ప్రాంతంలో తన స్నేహితులతో కలిసి గురువారం సముద్రంలో స్నానాలకు వెళ్ళి అలల తాకిడికి మునిగిపోతున్నందున కోలకతాకు చెందిన కుశాల్ (24) అనే యువకుడను.., నిత్యం నిఘాలో వుంటూ విధులు నిర్వహిస్తున్న జీవీఎంసీ లైఫ్ గార్డులు ఎం.నవీన్, కెపిఎస్ .శ్రీనివాస్, జె.హర్షిత్, టి.కళ్యాణ్ లు రక్షించి ప్రాణాలు కాపాడరని కమీషనరు తెలిపారు. విశాఖ నగర పరిధిలో గల బీచ్ లలో లైఫ్ గార్డులను నిత్యం నిఘాలో వుంచి ప్రజల ప్రాణాలకు జివిఎంసి రక్షణ కల్పిస్తుందన్నారు. విశాఖ నగరానికి విచ్చేస్తున్న పర్యాటకులు, సందర్శకులు విశాఖ నగర సుందర తీరాలను, ఆహ్లాదకరమైన వాతావరణాని ఆస్వాదించాలని, సముద్ర తీరం ప్రాంత బీచ్ లలోనికి వెళ్ళి ప్రాణాలను పోగొట్టుకోరాదని కమీషనరు అన్నారు.